# అశ్రుతర్పణం

## శ్రీ సింగరాజు లింగమూర్తి

నడుస్తూ నడుస్తూవున్న శ్యామలరావు చటుక్కున ఆగిపోయి వెనక్కి తిరిగిచూసి, మళ్లీ ముందుకు అడుగు వెయ్యబోయాడు. "మిమ్మల్నేనండీ" అంటూ ఒక ఇరవై—ఇరవై రెండేళ్ళ యువతి అతణ్ణి సమీపించింది. శ్యామలరావు అప్పటికీ ఇంకా తనను కాదేమోనని ఆశ్చర్యంతో అలాగే ఆమెవంక చూస్తూ నిలబడ్డాడు. "అలా చూస్తారేం....పదండీ" అంటూ ఆమె అతని ప్రక్క ప్రక్కనే నడుస్తున్నది. శ్యామలరావును సంభ్రమాశ్చర్యాలు ముంచెత్తాయి. "ఎవరీమె?...ఎప్పుడూ ఎక్కడా చూడలేదే...ఒకవేళ ఈమె పొరబడటంలేదుకదా?" అనుకున్నాడు మనస్సులో. "పొరబడటానికి రాత్రిసమయం కాదే?... మనిషినిచూస్తే అంత పొరబడే తెలివితక్కువదికూడా కాదు...మరి ఈమె పట్టపగలు నడిబజారులో పిలిచి ఎంతో పరిచయమున్నట్టు మాట్లాడుతున్నదేమిటి?" అని తర్కించుకుంటున్నాడతను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ... ముక్కూ ముఖమూ తెలియని మిమ్మల్ని పిలిచాననా?" అతని ముఖంలోకిచూస్తూ ప్రశ్నించిందామె. దానితో అతను ఆమె పూర్తిగా అపరిచితురాలేనని నిశ్చయించుకున్నాడు. "చూడబోతే అసాధ్యురాలుగానే ఉంది. లేకపోతే ఎంత నాగరికురాలైతేమాత్రం ఒక పరాయివాడిని పట్టపగలు నడివీధిలో పిలిచి మాట్లాడుతూ ప్రక్కప్రక్కగా నడుస్తుందా?" ఆమె ప్రశ్నకేమీ సమాధానం చెప్పకుండానే అనుకుంటున్నాడతను.

ఇద్దరూ దగ్గరిగా ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు. అనుకోకుండానే శ్యామలరావు వెనక్కి తిరిగి చూశాడు. అతనితోపాటే ఆమెకూడా తిరిగి చూసింది. ఎవరో ఇద్దరు వాళ్లవెనకాలే వస్తున్నారు. అతని గుండె దడదడలాడింది. "కొంపతీసి తనకు తెలిసినవారుకాదుగదా?" అనుకుంటూ వాళ్ళను తేరిపారచూసి కాదని నిశ్చయించుకోడంతో అతని గుండె దడ తగ్గిపోయింది. వెనకాల వస్తున్నవాళ్లు నవ్వుతూ, తుళ్లుతూ ఏదో మాట్లాడుతూవస్తున్నారు. ఆమెతో నడుస్తుంటే ఒకటి రెండుసార్లు భుజం తాకడంవల్ల అతను కొంచెం ప్రక్కకు ఒదిగి నడుస్తున్నాడు. ఎదురుగ్గా ఒక కాఫీహౌసు కనిపించడంతో "కాఫీ తాగుదామా?" అతని కళ్ళల్లోకిచూస్తూ అందామె. శ్యామలరావుకు కుతిక పట్టుకున్నట్లయింది. "జేబులో డబ్బుల్లేవని సందేహిస్తున్నారుకదూ?... మరేంఫరవాలేదు నాదగ్గర ఉన్నాయిలేరండి" అంటూ ఆమె అతనిచేతినిపట్టుకొని ప్రేళ్లల్లో ప్రేళ్లుదూర్చి కాఫీహౌసులోకి దారితీసింది. శ్యామలరావుకు పసిపిల్లవాడిలా ఆమెను అనుసరించక తప్పింది కాదు. ఆమె బ్రెడ్, కాఫీ తెప్పించింది. "అట్లా బెరుగ్గా ఉంటారేం? — చిన్నప్పటి స్నేహితుడు కలిసినట్టు ఉషారుగా మాట్లాడక" నవ్వుతూ అందామె. అతను కొంత ధైర్యం తెచ్చుకొని "మీ పేరు?" అన్నాడు—ఆమె సౌందర్యాన్ని కళ్ళతో పుణుకుతూ. "మీరు అని మన్నించనక్కరలేదు. హేమా అని పిలవండి" అందామె. అతను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

'ఇదే తను ఒక పరాయి ఆడదాన్ని, అందులో అపరిచితురాలైన అందగత్తెను నడిబజారులో పిలిచి చనువుగా మాట్లాడిస్తే ఊరుకుంటుందా? ఎడంకాలి చెప్పుతీసి దౌడ వాయించేయదూ? అందుకే ఆడది ఎందుకైనా సమర్థురాలన్నారేమో?' ఆమె చనువుకు, తెగువకు ఆశ్చర్యపోతూ అనుకుంటున్నాడతను. ఇంతలో వారి వెనకాలే అనుసరిస్తున్న ఇద్దరుకూడా వచ్చి, వీళ్ళకు ఎదురుగ్గావున్న టేబిలుముందు కూర్చున్నారు. వాళ్ళిద్దరూ శ్యామలరావును అదోకలా చూస్తున్నారు. "వీళ్ళ ముఖం తగలెయ్య అట్లా చూస్తారేం తనను" అనుకుంటూ అతను హేమవంక

చూశాడు. "ఏమండి...ఇంటికి వెడదామా—సినిమాకు వెడదామా?" అంది హేమ. 'ఏమంటే ఆమె ఏమనుకుంటుందో' అనుకుంటూ "నీ ఇష్టం ఎలాగైనా సరే" అన్నాడు. ఇద్దరూ బైటికివచ్చారు. ఆమె ఆటోరిక్షాను పిలిచింది. ఆమె కూర్చుంటూ "రండి... కూర్చోండి" అంది. 'ఏమిటీ వైభవం' అనుకుంటూనే ఎక్కి కూర్చున్నాడు. 'ఏమిటీ మనిషితత్వం... ఆమె అంతస్తెక్కడ—తన అంతస్తెక్కడ?' ఆలోచిస్తూ కూర్చున్నాడు శ్యామలరావు.

'నేను అందమైనదాన్నే కదూ?' హేమ అతని కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది. అతను ఆమె ముఖంవంక చూస్తూ 'కాదని ఎవరనగలరు?' అన్నాడు. ఆమె స్నిగ్ధంగా నవ్వింది. 'ఇదంతా కలకాదుగదా' అనుకున్నాడు శ్యాం. 'మీ పేరు చెప్పరుకదూ?' ఛలోక్తిగా అందామె. 'ఎందుకు చెప్పనూ?' అన్నాడు శ్యాం. 'మరి ఇందాకటినుంచీ చెప్పలేదేం? నాపేరు అప్పుడే చెప్పేశానుగా' కొంటెగా అతనివంక చూస్తూ అంది.

'మరేంలా — మాటల్లో మరచిపోయాను. శ్యామలరావని అంటారు' అన్నాడు. 'చాలా బాగుంది. అయితే ఇకనుంచి శ్యాం అనే పిలుస్తాను. కోపం రాదుకదూ?' కిలకిల నవ్వుతూ అంది హేమ. 'ఏమిటీ విపరీత ధోరణి' అనుకుంటూనే, 'కోపమెందుకూ? మీరు ఎలా పిలిచినా సంతోషమే' అన్నాడు. 'అదుగో...నన్ను మళ్ళీ మీరు అని అంటున్నారు. నేనలా ఒప్పుకోను, నేనుకూడా ఇకనుంచీ 'నీవే' అని అంటాను. స్నేహితులం. నీవు—నీవు అని పిలుచుకుంటే తప్పేముందీ?' అంది హేమ. ఆమె మాటలకు శ్యామలరావుకు నవ్వు వచ్చింది. ఆటోరిక్షా ఒక పార్కుముందు నుంచి పోతున్నది. "కాసేపు పార్కులో కూర్చుని పోదాం లే శ్యాం" అంటూ ఆటోరిక్షాను ఆపించింది.

ఇద్దరూ వెళ్ళి పార్కులో పచ్చికమీద కూర్చున్నారు.

"చూశావా శ్యాం...అందరి కళ్లూ మనమీదే ఉన్నాయి" అంది. అతనేం మాట్లాడలేదు. "అన్నా చెల్లెళ్ళి చూసినా తెలియనివాళ్లు ఏవేవో సంబంధాలు కల్పిస్తారు." మళ్లీ ఆమే అంది.

"తెలియనివాళ్లు అనుకోడంలో తప్పేముందీ?" ఆమెనుండి ఏమి సమాధానం వస్తుందోనని సందేహిస్తూనే అన్నాడతను.

"ఎందుకు తప్పుకాదూ? మనిద్దరినీ స్నేహితులని ఎందుకు అనుకోరాదూ?" రెట్టిస్తున్నట్టుగా అంది హేమ.

"నీవన్నది నిజమే హేమా? కానీ లోకం దృష్టిలో అలా అనిపించదేమో?" సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా అన్నాడతను.

"అదేం కాదు శ్యాం. ఆడదంటే అంత చులకన అయిపోయింది. ఏం?—ఒక ఆడదీ మొగవాడూ పవిత్ర హృదయాలతో స్నేహంగా ఎందుకు ఉండరాదూ?" చేత్తో గడ్డిపరకల్ని త్రుంచుతూ అంది హేమ.

శ్యాం ఆలోచనలోపడ్డాడు. "నిజమే...ఇద్దరు మొగవాళ్ళూ, ఇద్దరు ఆడవాళ్ళూ స్నేహంగా ఉన్నట్టు, ఒక ఆడది మొగవాడూ స్నేహంగా ఎందుకుండరాదూ?...ఊహూ...అది సాధ్యంకాదేమో? స్త్రీ అంటేనే ఒక ప్రత్యేకమైన ఆకర్షణ పురుషుడికి. అలాగే పురుషునిలోనూ ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉండి స్త్రీని లొంగదీసుకుంటుంది. ఇద్దరూ సమవయస్కులై యౌవనం సుళ్లు తిరుగుతున్నప్పుడు పవిత్రమైన స్నేహం ఎలా సంభవమౌతుంది - ఎంతటి మనోనిగ్రహంకలవారికో తప్ప? ఈమె పవిత్రమైన స్నేహవాత్సల్యంతోనే నా చేతిలో చేయి కలిపి, వ్రేళ్లల్లో వ్రేళ్లు దూర్చి, భుజం భుజం తాకుకుంటూ నడిచింది? అదీ—ఇంతకుముందు ముక్కూ ముఖమూ తెలియనివాడితోనా?" అనుకుంటున్నాడు శ్యాం.

"ఏమిటి ఆలోచిస్తున్నావు శ్యాం" అతని సమాధిని భగ్నంచేస్తూ అంది హేమ.

"అబ్బే... ఏమీ లేదు. మన కలయికను గూర్చి" అతని వాక్యం పూర్తికాకుండానే హేమ అందుకొని "ఏం, మనం స్నేహంగా ఉండలేమనా?" అంది.

"ఎందుకుండలేం....కానీ" సాగదీస్తూ అన్నాడు శ్యాం.

"కానీలేదు—గినీలేదు....లే పోదాం" అంటూ హేమ లేచింది. ఇద్దరూ వెళ్ళి మళ్ళీ ఆటోరిక్షాలో కూర్చున్నారు. డ్రైవరుకు తన ఇంటిగుర్తులు చెప్పి పోనియమందామె.

'సినిమాకు వెడదామన్నావుగా' ఆమెకు జ్ఞాపకం చేస్తున్నట్టుగా అన్నాడు శ్యాం.

'ఉహూ....సినిమా చూస్తే నాకు ఏడుపొస్తుంది. ఇంటికే వెడదాం' అంది హేమ. అతనేం మాట్లాడకుండా కూర్చున్నాడు. ఆటోరిక్షా నడుస్తున్నది.

'సినిమా చూస్తే ఎందుకు ఏడుపొస్తుందో?... అటువంటిది ఇందాక సినిమాకు వెడదామా అని ఎందుకు అడిగింది ... పార్కులో కూర్చుందామని దిగి, పట్టుమని పదినిముషాలుకూడా కూర్చోలేదే— ఏమిటీ మన స్తత్వం ఆలోచిస్తున్నాడుశ్యాం. ఏమిటో ఆమెతరహా అయోమయంగా ఉందనుకున్నాడు.

'ఇందాక కాఫీహౌసులో మనకెదురుగావచ్చి కూర్చున్న ఇద్దరూ ఎవరనుకున్నావు శ్యాం?" అని ప్రశ్నించింది హేమ. తనకేం తెలుసు అన్నట్టుగా చూశాడు శ్యాం.

'వాళ్ళిద్దరూ నన్ను వెంటాడారు?"అందామె.

'ఎందుకూ?' సందేహాస్పదంగా అన్నాడతను.

'ఒంటరిగా ఆడది కనబడితే ఎందుకు వెంటాడుతారేం?'

'సరే—ఆమె తనవెందుకు పిలిచి మాట్లాడించిందో ఇక అర్థమైందనుకున్నాడు శ్యాం. "మొత్తానికి భలే తెలివిగలది. వాళ్లబారినుండి తప్పించుకోనేందుకు తనను ఈవిధంగా ఉపయోగించుకుందన్నమాట. అయితే మాత్రం ఒక పరాయి మొగవాడితో భుజాలు రాసుకుంటూ నడవవలసిన అవసరం ఏమిటి? చూడబోతే బాగా చదువుకున్నదానిలాగ ఉంది. ఈమెను వెంటాడటానికి వాళ్లకు ధైర్యం ఎలా వచ్చిందో' అని అనుకుంటున్నాడు శ్యాం.

'వాళ్లిద్దరూ ఆసుపత్రిలో కంపౌండర్లు. బజారులో ఒక్కదాన్నే కనబడేప్పటికి వెంటబడ్డారు. దేవుడిలా నీవు కనపడ్డావు కాబట్టె సరిపోయింది. లేకపోతే ఏమయ్యేదో?' అంది హేమ.

ఇంతలో ఆటోరిక్షా ఆమె ఇంటిముందు ఆగింది. "ఇక నేను వెడతా—నా డ్యూటీ అయిపోయిందిగా" అన్నాడు శ్యాం.

'అదేమిటి...అలా అంటావేంశ్యాం?' ఆశ్చర్యంతో అందామె.

"నీవు క్షణంగా ఇల్లు చేరుకుంటానికేగా నన్ను ముక్కుకు తాడుబోసినట్టు లాక్కొని వచ్చింది." కొంచెం ఉక్రోషంతోనే అన్నాడు శ్యాం.

"నీవు ఉత్త పిచ్చివాడివి శ్యాం...అట్లా అయితే నిన్ను పార్కును చేరకముందే విడిచిపెట్టేదాన్నిగా. మనం ఆటోరిక్షా ఎక్కాక వాళ్లు తెల్లముఖాలు వేసి వెళ్ళిపోయారు తెలుసా?" నవ్వుతూ అందామె.

"అరరే...తను తొందరపడి అనేశానే" అని నాలుక కరుచుకొని సిగ్గుపడ్డాడు శ్యాం.

*    *    *    *

"ఎక్కడికి వెళ్లావు తల్లీ...నీకోసం బెంగపడి కూర్చున్నాం" అంటూ ముసలి దంపతులు వీధిగుమ్మంలోకి వచ్చారు.

'ఏం?... ఎందులోనైనాపడి చస్తాననుకున్నారా?' అంటూ 'రా శ్యాం లోపలికి' అని అతని చెయ్యిపట్టుకొని లోపలికి దారితీసింది.

'ఇతనెవరమ్మా?' సందేహిస్తున్నట్టుగా ప్రశ్నించాడు ఆమె తండ్రి.

'ఎవరా?...ఆ స్కౌండ్రల్ కాదు. ఇతను నిజాయితీగల మనిషి. పెళ్లిచేసుకుంటానని చెప్పి మోసగించిన దగుల్బాజీకాదు. అతనూ మీరూ కలిసి నా జీవితాన్ని సర్వనాశనం చేశారు. మీరు రాక్షసులు కాని తల్లిదండ్రులా?' అంటున్నది హేమ. శ్యామలరావుకు ఇదేమీ అర్థంకాక స్తబ్దంగా నిలబడిపోయాడు. హేమ ముఖం కందగడ్డలా అయిపోయింది. కోపంతో కళ్లు ఎర్రబడ్డాయి. అంత సుందరమైన విగ్రహం నిమిషంలో కాళీరూపం దాల్చింది. శ్యాం ఆమెవంక చూడలేకపోతున్నాడు. ఉన్నట్టుండి హేమ పెద్ద పెట్టున ఏడుస్తూ తల నేలకు కొట్టుకుంటున్నది. తల్లిదండ్రులు ఆమెను వారించబోయేప్పటికి ఆమె వాళ్ళను కొట్టబోయింది. ఆమె అలా కొట్టుకొని ఏడుస్తుంటే శ్యాం చూస్తూ ఊరుకోలేక ఆమెను పట్టుకుంటానికి దగ్గరగా పోబోయాడు. 'వద్దు నాయనా వద్దు...అది ఆ పిచ్చిలో ఎవరినైనా లెక్కచేయకుండా కొడుతుంది' అంటూ హేమ తండ్రి శ్యామును పట్టుకున్నాడు. హేమ అట్లా ఏడ్చి ఏడ్చి స్మృతితప్పి పడిపోయింది.

'హేమ పిచ్చిదా?...ఎంత చక్కగా మాట్లాడింది. ఎటువంటి మంచి అభిప్రాయాలు వెలిబుచ్చింది' అనుకుంటూ ఆశ్చర్యపోయాడు శ్యాం. ఆమె తల్లిదండ్రుల కళ్ళల్లో నీళ్ళు చూసేప్పటికి అతని కళ్లుకూడా చెమ్మగిలినాయి. ఆ దంపతులు కాసేపు హేమకు ఉపచారాలు చేసేప్పటికి ఆమెకు కొంచెం స్పృహకలిగింది. ఆమెను నెమ్మదిగా మంచంమీద పడుకోబెట్టారు. శ్యాం వెళ్ళిపోదామనుకున్నాడు. కాని వెళ్లడానికి కాళ్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ అక్కడే కూర్చున్నాడు. గోడల

కున్న ఫోటోలు చూస్తుంటే హేమ ఫోటో కనిపించింది. స్టెతస్కోపు పట్టుకొని చిరునవ్వులు చిందుతోంది. దానిప్రక్కనే ఫ్రేముకట్టివున్న ఆమె మిడిసిన్ డిప్లొమా కనిపించింది. శ్యాం ఆశ్చర్యపోయాడు. 'హేమను ఏదో కాస్త చదువుకుందనే అనుకున్నాడు కాని, లేడీడాక్టరని అనుకోడానికే ఆస్కారం లేకపోయిందే' అనుకున్నాడు. ఇంతలో హేమ తండ్రి అక్కడికి వచ్చి అతనిప్రక్కనే కూర్చున్నాడు.

"చూశావా నాయనా...ఇదీ వరుస. ఇట్లా రోజుకు ఒకసారైనా వస్తుంటుందీ పిచ్చి." కన్నీళ్లు పెట్టుకుంటూ అన్నాడాయన.

"ఒక్కగానొక్క కూతురు. ఎంతో గారాబంగా పెంచాము. మొదటినుంచీ ఉత్తమాశయాలతో ఉండేది. లేడీడాక్టరుఅయి ప్రజాసేవ చేయాలని మురిసిపోతుండేది. అలాగే అయింది. మొదట్లోనే స్వంత డిస్పెన్సరీ ఎందుకని, కొంత అనుభవంకోసం ఏ ఆసుపత్రిలోనైనా చేరుదామనుకుంది. నా పలుకుబడివల్ల ఈ ఊరి ఆసుపత్రిలోనే ఉద్యోగం దొరికింది. ఒక సంవత్సరం ఎంతో ప్రశాంతంగానే గడిచింది. హేమ పనిచేస్తున్న వార్డులోకే మరో క్రొత్తడాక్టరు వచ్చాడు. అతనూ చాలా మంచివాడే. వీళ్ళిద్దరికీ మంచి స్నేహమైంది. ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అతను మాఇంటికి వస్తుండేవాడు. ఈడూ జోడూ బాగుందనీ, ఇద్దరూ డాక్టర్లే కాబట్టి ప్రాక్టీసు పెట్టి ప్రజాసేవ చేస్తారనీ ఎంతో కుతూహలపడ్డాను. హేమా అతనూకూడా అలాగే అనుకున్నారు. ఎక్కడికి వెళ్ళినా, ఏ సినిమాకు వెళ్ళినా కార్లో ఇద్దరూ కలిసే వెళ్లేవారు. అతను మా వర్ణంవాడు కాకపోయినా మేమంతగా పట్టించుకోలేదు. కానీ అనుకున్నవన్నీ జరిగితే ఇక లేనిదేముందీ? అతను ఎవరికీ తెలియకుండా నెలరోజులు సెలవుపెట్టి వాళ్ల ఊరికి వెళ్ళిపోయాడు. అప్పటికే హేమ దిగులుపడిపోయింది. ఒకరోజు అతనిదగ్గిరినుంచి ఉత్తరం వచ్చింది. తన వాగ్దానం నెరవేర్చనందుకు క్షమించమనీ, తల్లిదండ్రుల బలవంతంమీద మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకున్నాననీ ఆ ఉత్తరంలో వ్రాశాడు. దానితో హేమకు పూర్తిగా మతిపోయింది. మళ్ళీ ఇక్కడికి రావడానికి ముఖం చెల్లక అతను ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. అతని తియ్యనిమాటల్లో ఒక మామూలు ఆడదిలాగానే హేమ మోసపోయింది. ఆమే కాదు—మేమూ మోసపోయాము. అతనికేం అతను క్షమించమని తేలిగ్గానే అనేశాడు. ఇది క్షమించతగిందేనా? త్రాష్టుడు హేమజీవితం నాశనం చేశాడు. అప్పటినుంచే ఈమెకు పిచ్చిపట్టుకుంది. ఆమెను ఇల్లు కదలకుండా కంటికి రెప్పలా చూసుకుంటున్నాము. ఇవ్వాళ్ళ ఎప్పుడూ రానిపరాకు రావడంవల్ల వీధిలోకి వెళ్ళిపోయింది. మనిషి బాగానే మాట్లాడుతున్నట్టు ఉంటుంది. ఆ మాటల్లో ఏవో తెలియని అర్థాలుంటాయి. ఉన్నట్టుండి ఇందాకటిలా పిచ్చివచ్చి హైరానపడిపోతుంది' అంటూ ముసిలాయన హేమ జీవితాన్ని గూర్చి క్లుప్తంగా చెప్పాడు.

ఆరోజునుంచీ శ్యాములరావు ఇంచుమించు ప్రతిరోజూ హేమయింటికి వెడుతూ గంటలకొద్ది ఆమెతో మాట్లాడుతూ ఉండేవాడు. ఆమెపిచ్చి రోజురోజుకూ ఎక్కువకాసాగింది. దానితోపాటు ఆరోగ్యంకూడా చెడిపోతూవచ్చింది. ఆ పిచ్చిధోరణిలో శ్యామును కూడా ఏమిటేమిటో అనేది, కాని అతనవేమీ పట్టించుకొనేవాడు కాదు. వైద్యుల సలహాతో ఆమెను విశాఖపట్నం పిచ్చిఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడినుంచి హేమ తండ్రి వారానికోసారి శ్యామలరావుకు ఉత్తరం వ్రాస్తుండేవాడు.

రెండు నెలలు నిమిషాలమీద జరిగిపోయాయి. ఒకరోజు 'హేమ నిన్ను చూడాలంటున్నది. వెంటనే బయలుదేరిరా' అని శ్యాముకు ఆమె తండ్రి టెలిగ్రాంతోపాటు డబ్బుకూడా పంపాడు.

శ్యామలరావు వెళ్లకుండా ఉండలేకపోయాడు. హేమను చూసి మొదట్లో గుర్తించలేక పోయాడు. ఆమె దేహం కృశించినా ముఖంలో ఏదో ఆకర్షణ ఉట్టిపడుతున్నది. అతనిరాకకు హేమ తల్లిదండ్రులు ఆనందించారు. హేమ తన చేతుల్లోకి శ్యాం చేతులు తీసికొని నవ్వింది. 'చాలా చిక్కిపోయాననుకుంటున్నావు కదూ శ్యాం?...మనిద్దరం స్నేహంగా ఉండామనుకున్నాము. మన స్నేహంలో మాలిన్యంలేదు... కపటాలు, కార్పణ్యాలూ అసలే లేవు. కానీ... శ్యాం....మనం ఇక స్నేహంగా ఉండలేం...నిన్ను చూస్తుంటే మతిపోతున్నది....నిన్ను మోసం చేస్తున్నాను శ్యాం...నీ స్నేహితురాలిని మరచిపోవు కదూ' అని అంటుంటే ఆమె కంఠం జీరపడింది. ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి. 'ఏడవకు హేమా... జీవితంలో నిన్ను మరచిపోలేను' ఆమె ముంగురులు సరిచేస్తూ అన్నాడు శ్యాం. ఆమె కళ్ళల్లో నీళ్లు అలాగే నిలిచిపోయాయి. ఆమె నుండి మళ్లీ ఏ సమాధానమూ రాలేదు. శ్యాం ఆదుర్దాగా ఆమెను పరిశీలించి చూశాడు. "హేమా!...హేమా!...నీ స్నేహితుణిని వదిలి వెళ్లిపోయావా హేమా?" బొంగురు గొంతుతో అన్నాడు శ్యాం. అతని కళ్ళల్లో నీళ్లు నిండాయి. రెండు కన్నీటిబిందువులు హేమ ఫాలభాగం మీదపడి ఆమె కన్నీటి చాలికలలో కలిసిపోయాయి.